ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్ డే
2





సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
2

AKSHARA TODAY
అక్షర చిటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని నాగపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుడు బొమ్మిడిత రవి నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఆహ్వానం మేరకు మానాల మోహన్ రెడ్డి కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

25-9-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2





# వెల్లిరావయ్యా.. బొజ్జగణపయ్యా..



- ఘనంగా నిమజ్జన శోభాయాత్ర
- ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు
- పోలీసుల భారీ బందోబస్తు
- రథయాత్రను ప్రారంభించిన పీసీసీ చీఫ్, ఎమ్మెల్యే



– మిగతా ఫొటోలు 2వ పేజీలో..

నవరాత్రులు పూజలందుకున్న లంబోదరుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. 'గణపతి బప్పా మోరియా.. ఆగలే వర్స్ తుమ్ జల్దీ ఆ..' అంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నగరంలోని దుబ్బలో సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో మధ్యాహ్నం రెండుగంటలకు రథయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి ఈ యాత్ర రైల్వేకమాన్, గంజ్ మార్కెట్ మీదుగా బోధన్ బస్టాండ్ మీదుగా సాగింది. గురుద్వార్, లక్ష్మి మెడికల్ చౌరస్తా నుంచి గోల్‌హనుమాన్ చౌరస్తా మీదుగా వినాయకుల బావికి చేరుకోవడంతో రథయాత్ర ముగిసింది. పీసీసీ చీఫ్,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ ఉమారాణి కలిసి యాత్రను ప్రారంభించారు. సీపీ సాయిచైతన్య ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.

– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

## రాష్ట్రంలోనే ప్రత్యేకం.. ఇందూరు వినాయకుడి శోభాయాత్ర



**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర రాజధాని తర్వాత ఇందూరులోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా వినాయకుడి శోభాయాత్ర కొనసాగుతుందని, ఎంతో ఘన చరిత్ర ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని దుబ్బ చౌరస్తాలో శుక్రవారం రథయాత్రను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వాతంత్ర ఉద్యమంలో ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ ఇచ్చిన పిలుపుమేరకు ఇందూరులోనూ వినాయకుడి రథయాత్ర ప్రారంభించారని గుర్తు చేశారు. 21 జతల ఎడ్లతో అంగరంగ వైభవంగా శోభాయాత్ర నగరంలోని ప్రధాన వీధుల మీదుగా ముందుకు సాగుతుందన్నారు. యువత భక్తిమార్గంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ఇందుకు ఇందూరు యువతే నిదర్శనమన్నారు. వందేళ్లుగా రథం శోభాయాత్ర సాంప్రదాయం కొనసాగుతుందన్నారు. ప్రధానంగా నగరంలోని పలు కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు శోభాయాత్ర ఆద్యాంతం సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## గోదావరిలో గణేష్ విగ్రహాల నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** గోదావరిలో గణేష్ విగ్రహాల నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నందిపేట్ మండలం ఊమ్మెడ బ్రిడ్జి వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు.

### భద్రతా చర్యలపై సిబ్బందికి సూచనలు..

గోదావరి నదిలో గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా భారీ గణేష్ విగ్రహాలను గోదావరి నీటిలో నిమజ్జనం చేసే సమయంలో నిర్వాహకులు, భక్తులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. భారీ విగ్రహాల నిమజ్జనం సమయంలో ఎవరూ ప్రమాదకరంగా నీటిలోకి వెళ్లకుండా చూడాలని, పోలీస్ సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

### పార్కింగ్‌పై అవగాహన..

నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీస్ శాఖకు ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంలో భారీ వినాయకుల నిమజ్జనం కోసం భారీ క్రేన్లను ఏర్పాటు చేశారు. అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, సీటీసీ ఏసీపీ రాజశేఖర్, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, నందిపేట్ ఎస్సై వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## టీపీసీసీ చీఫ్‌కు శుభాకాంక్షలు తెలిపిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

**అక్షరటుడే, కామారెడ్డి :** టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, కామారెడ్డి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా రెండేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని పీసీసీ రెసిడెన్సీలో శుక్రవారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం, సంస్థాగతంగా పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లడం కోసం ఆయన నాయకత్వం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. రెండేళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా భవిష్యత్తులో పార్టీకి మరింత సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ గడ్డమీది మహేష్, డీసీసీ జనరల్ సెక్రెటరీ జూలూరి సుధాకర్, గంగుల్ రెడ్డి పాల్గొన్నారు.



## సమన్వయంతో ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనం



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణం లో అన్నిశాఖల సమన్వయంతో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, గణేష్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిశాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. డీజే చప్పుళ్లు లేకుండా డప్పు వాయిద్యాలు, డోలు విన్యాసాలతో భక్తి పారవశ్యంతో కులమతాలకు అతీతంగా పండగ వాతావరణంలో శోభాయాత్ర జరిగిందని ఛైర్‌పర్సన్ కొనియాడారు. నవరాత్రుల ప్రారంభం నుండి నిమజ్జనం పూర్తయ్యే వరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ ప్రజల సహకారం, వివిధ గణేష్ మండపాల నిర్వాహకుల క్రమశిక్షణ వల్లనే నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతమైందన్నారు. నిమజ్జన వేడుకలను పటిష్టంగా నిర్వహించడంలో రాత్రింబవళ్లు శ్రమించిన మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, విద్యుత్ శాఖ అధికారులు, పోలీసు యంత్రాంగానికి, అలాగే సహకరించిన మీడియా మిత్రులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలో గురువారం రాత్రి 9 గంటల వరకు సుమారు 451 భారీ వినాయక విగ్రహాలు నిమజ్జనం జరిగాయని, అదే విధంగా సుమారు వంద వరకు చిన్న విగ్రహాలు కూడా భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా కామారెడ్డి పట్టణాభివృద్ధికి, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ ఇదే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## వీజీపీపీపీపై అధికారులకు అవగాహన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** మండలంలోని మిసాన్‌పల్లి జీపీ పరిధిలోని రైతు వేదికలో మూడు మండలాలకు సంబంధించిన వీజీపీ పీపీ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఎల్లారెడ్డి, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల పరిధిలో కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి అదనపు డీఆర్‌డీవో హాజరై సంబంధిత అధికారులు, సిబ్బందికి వీజీపీపీపీపై అవగాహన కల్పించారు. కార్యక్రమ ఉద్దేశాలు, అమలు విధానం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, సర్పంచులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. మూడు మండలాలకు చెందిన అధికారులు ఒకే వేదికపై సమావేశం కావడంతో ఆయా మండలాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, అధికారుల బాధ్యతలపై పరస్పరం చర్చించారు. కార్యక్రమం ద్వారా అధికారులు, సిబ్బందికి అవసరమైన అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత ఏర్పడినట్లు అధికారులు తెలిపారు.









# గంగమ్మ ఒడికి గౌరీ తనయుడు

నగరంలోని వినాయక్‌నగర్‌లోని గణపతుల బావి వద్ద విఘ్నేశ్వరుల నిమజ్జనోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా అంతా కలిసి తమ ఇళ్లల్లో, అపార్ట్‌మెంట్లలో, మండపాల్లో నెలకొల్పిన చిన్న వినాయకులను బ్యాండ్ మేళాలు, డప్పు చప్పుళ్ల మధ్య గణపతుల బావి వద్దకు తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. మున్సిపల్ యంత్రాంగం బావి వద్ద భక్తులు ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేసింది.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్




























## శిశుమందిర్‌లో సామూహిక వందేమాతర గీతాలాపన



**అక్షరటుడే, కమ్మర్ పల్లి:** వందేమాతరం 150ఏళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం సామూహిక గీతాలాపన చేశారు. ఆర్ఎస్ఎస్ జిల్లా సేవా ప్రముఖ్ మంతెన ప్రదీప్ హాజరై మాట్లాడుతూ బంకించంద్ర ఛటర్జీ రచించిన సంస్కృత గీతం వందేమాతరం, అహింసాయుత భారత స్వాతంత్ర్య ఉద్యమంలో రణనినాదంగా ఉపయోగపడిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ గేయాన్ని జాతీయగేయంగా భారత ప్రభుత్వం స్వీకరించిందన్నారు. శిశు మందిర్ అధ్యక్షుడు మర్యాద నాగభూషణం, ప్రిన్సిపల్ ఉట్నూర్ రాజశేఖర్, దంతుల రమణయ్య, పసుపుల చంద్రమోహన్, భోగ రామస్వామి, నల్ల గణేష్ గుప్తా పాల్గొన్నారు.

## అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పూర్తి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ అబ్బాపూర్ రవీందర్ పేర్కొన్నారు. నవీపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించారు. నవీపేట్ జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం గంగమణి పోటీలను ప్రారంభించారు. . అనంతరం వెయిట్ లిఫ్టింగ్ పోటీలను పీడీ డాక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పీడీలు వెంకటేశ్వర్ రావు, అబ్బయ్య, రమేష్, గణేశ్, అలివేలు మంగమ్మ, అనురాధ, కవిత, ప్రమిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మలకు పూర్వవైభవమే లక్ష్యంగా పనిచేస్తాం



**అక్షరటుడే, బాల్కొండ:** హైదరాబాద్ బోరబండ విశ్వకర్మ దేవాలయం నుంచి ఢిల్లీ వరకు చేపట్టిన విశ్వకర్మ ఏక్తా యాత్ర శుక్రవారం బాల్కొండకు చేరుకుంది. 74 రోజుల పాటు 1,700 కిలోమీటర్ల మేర కొనసాగనున్న ఈ యాత్ర సెప్టెంబర్ 17న ప్రారంభమై నవంబర్ 29న ఢిల్లీలో ముగింపు సభతో ముగియనుందని నిర్వాహకులు తెలిపారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చీఫ్, ఫౌండర్ బ్రహ్మశ్రీ విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ విశ్వకర్మ సమాజానికి జాతీయ సంక్షేమ, అభివృద్ధి కమిషన్, ప్రత్యేక కేంద్ర వ్యవస్థ ఏర్పాటుకు డిమాండ్ చేస్తున్నామన్నారు. సుంకం దినేష్, శ్రీపాద తుకారం, రవి, నరేష్, కోటగిరి అంజయ్య, లింబాద్రి, రాజు, మోహన్, మండాజి యోగేశ్వర్, హన్మాండ్లు పాల్గొన్నారు.

## నాగంపేట్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి రవి మాట్లాడుతూ.. ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు చేయూత అందిస్తోందన్నారు. పేదల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేంపల్లిలో కొత్త జాబ్ కార్డుల పంపిణీ

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం లబ్ధిదారులకు కొత్త జాబ్ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీడీవో బి.రమేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు జాబ్ కార్డులను అందజేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు పని అవకాశాలు కల్పించేందుకు జాబ్ కార్డులు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ యాదవ్, వార్డు సభ్యురాలు బట్టు మాధురి, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ జగదీశ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్సై



**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఎస్సై కె. కిరణ్ పాల్ దగ్గరుండి పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. క్రేన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసి వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని కొనసాగిస్తున్నారు. భక్తులు, నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ సహకరించాలని ఎస్సై కోరారు.

## ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్ డే



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలో ప్రపంచ ఫార్మసిస్ట్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లో ఆయుష్ విభాగంలో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ పురుషోత్తం, ఉమా ప్రసాద్‌ను జిల్లా ఆయుష్ ఇన్‌ఛార్జి డాక్టర్ గంగాదాస్ ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతు ఆయుష్ శాఖలో పనిచేస్తున్న ఫార్మసిస్ట్‌ల సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో యోగా వైద్యులు తిరుపతి, డయాలసిస్ టీవీ వార్డ్ ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.